నేడు ప్రజావాణి రద్దు

రంగారెడ్డి అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సోమవారం రద్దు చేసినట్లు రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు నారాయణ రెడ్డి, ప్రతీక్‌జైన్, గౌతమ్‌లు తెలిపారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నందున సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమం రద్దు చేశామని వారు ప్రకటనల్లో పేర్కొన్నారు.



అంబరాన్నంటేలా..

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు సర్వం సిద్ధం


విద్యుత్ వెలుగుల్లో వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం


వేడుకల కోసం రంగారెడ్డి కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాట్లు


రంగారెడ్డి కలెక్టరేట్ వద్ద వేదికను సిద్ధం చేస్తున్న సిబ్బంది

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలను నేడు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అంబరాన్నంటేలా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఉత్సవాల విజయవంతానికి మూడు జిల్లాల కలెక్టర్లు అన్ని శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్ల ప్రాంగణాలు, వివిధ కార్యాలయాలను పూలు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. కలెక్టర్ల ఆధ్వర్యంలో వేడుకలు అంబరాన్నంటేలా జరగనున్నాయి.

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ముస్తాబైన కలెక్టరేట్లు, కార్యాలయాలు

జాతీయ పతాకం ఎగరవేయనున్న పాలకులు


మేడ్చల్ కలెక్టరేట్ ఆవరణలో వేడుకలకు చేసిన ఏర్పాట్లు

రంగారెడ్డి అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలు ముస్తాబయ్యాయి. తెలంగాణ ఆవిర్భవించి పదకొండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, కలెక్టరేట్లు, చౌరస్తాల్లో విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఆవిర్భావ వేడుకల్లో భాగంగా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలా పెద్దఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో అధికారికంగా ఉత్సవాలు జరపనున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ఇలా అన్ని వర్గాల ప్రజలు తెలంగాణ వేడుకల్లో పాలుపంచుకోనున్నారు.

రంగారెడ్డి కలెక్టరేట్‌లో వేం నరేందర్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద కలెక్టర్ ఉదయం 10గంటలకు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. ఉదయం 10:10 గంటలకు జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉదయం 10:15 గంటలకు విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పలు పథకాలకు సంబంధించి ఉదయం 11:15 గంటలకు స్టాల్స్‌లో ప్రదర్శించనున్నారు. 11:30 గంటలకు జాతీయ గీతాలాపన, వందన సమర్పణతో

మిగతా 5వ పేజీలో...


ఎంపీ రవికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే శంకర్, జితేందర్‌రెడ్డి

ఎంపీ మల్లు రవికి ఘన స్వాగతం

షాద్‌నగర్ అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా ఎంపికై ఢిల్లీ నుంచి వచ్చిన నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవికి నాయకులు ఘన స్వాగతం పలికారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లి అక్కడికి వచ్చిన ఎంపీ రవిని ఎమ్మెల్యే శంకర్, ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డిలు సన్మానించి, అభినందనలు తెలిపారు. ఎంపీని సన్మానించిన వారిలో షాద్‌నగర్ కాంగ్రెస్ నాయకులు బాబర్‌ఖాన్, జి.బాల్‌రాజ్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, చెంది తిరుపతిరెడ్డి, ఎ.కృష్ణారెడ్డి, రఘునాయక్, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, ఇబ్రహీం, శ్రీకాంత్‌రెడ్డి, రాజు, ముబారక్, ఖదీర్ ఉన్నారు.


ఎమ్మెల్సీ కోదండరాంకు వినతిపత్రం ఇస్తున్న వెంకట్‌రాంరెడ్డి

ఉద్యమకారులను ఆదుకోండి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అహోరాత్రులు శ్రమించిన ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంకు వినతిపత్రం ఇచ్చింది. ఆదివారం సంఘం షాద్‌నగర్ అధ్యక్షుడు పి.వెంకట్‌రాంరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యమకారులు కోదండరామ్‌ను కలిసి తమ డిమాండ్లను వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులకు గుర్తింపు కార్డులివ్వాలని కోరారు. ఉద్యమ కారుల కోసం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, 250 గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వాలని, ఆరోగ్య బీమా, గౌరవ భృతికల్పించాలని, పథకాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రతీ నియోజకవర్గం కేంద్రాల్లో తెలంగాణ అమర వీరుల స్థూపం, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు జి.శ్రీనివాస్, ఎ.యాదయ్య, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, జి.సుధాకర్, ఎ.రాజు, బాలునాయక్, జాంగారి నర్సింహులు, రవికుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

నాలుగెకరాల విస్తీర్ణంలో ప్రాంగణం

కొత్త ప్లాట్‌ఫాంలు నిర్మించని వైనం

రోజూ 88 బస్సులు.. 33వేల కి.మీ రవాణా

25వేల మంది ప్రయాణం

బస్‌స్టాండ్ విస్తరణకు ఎమ్మెల్యే కృషి చేయాలి: ప్రయాణికుల డిమాండ్

50 ఏళ్లవుతున్నా అభివృద్ధికి నోచని

బస్‌స్టాండ్

ఎండ, వానల్లో ప్రయాణికుల నిరీక్షణ

ఉమ్మడి జిల్లాలో ముఖ్యమైన బస్‌స్టాండ్‌గా పేరొందిన షాద్‌నగర్ ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం నేటికీ అభివృద్ధికి నోచుకోవడం లేదు. బస్టాండ్ నిర్మించినప్పుడు కట్టిన నాలుగు ప్లాట్‌ఫామ్‌లతోనే నేటికీ నెట్టుకొస్తున్నారు. బస్సుల సంఖ్య పదుల్లో, ప్రయాణికుల సంఖ్య వేలల్లో పెరిగినా మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. ప్రయాణికులు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ బస్సుల కోసం వేచి చూస్తున్నారు. తెలంగాణ, రాయలసీయ ప్రాంత ప్రజలు వేలాది మంది ప్రయాణిస్తున్న ఈ బస్టాండ్‌ను ఆధునికీకరించి ఇబ్బందులు తీర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.


బెంచీలు లేక నిలబడిన ప్రయాణికులు

షాద్‌నగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ బస్‌స్టాండ్ నిర్మాణమై అర్ధ శతాబ్దానికి దగ్గరవుతోంది. కానీ నేటికీ ఎక్కడవేసిన గొంగడి అక్కడే.. అన్న చందంగా ఉంది. ఓ వైపు స్వాతంత్ర్యానికి పూర్వం నిర్మించిన షాద్‌నగర్ రైల్వే స్టేషన్ ఆధునిక హంగులతో ముస్తాబవుతుంటే ఆర్టీసీ బస్టాండ్‌లో మాత్రం ప్రయాణికులకు సరైన సదుపాయాలు కల్పించలేదు. కూర్చునేందుకు సరైన చోటు లేక, సమయానికి బస్సులు రాక ప్రయాణికులను అవస్థలకు గురవుతున్నారు. నాలుగెకరాల్లో విస్తరించిన ఈ బస్‌స్టాండ్/డిపోలో నాటి నుంచీ సదుపాయాలు కల్పించని దుస్థితి ఉంది. 1978లో నాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి ప్రారంభించిన ఈ బస్‌స్టాండ్ చరిత్రను ఒక్క సారి పరిశీలిస్తే...

రెండు బస్సులతో ప్రారంభమై

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణ పేట తర్వాత నాలుగో డిపో షాద్‌నగర్ డిపో ఏర్పాటైంది. నాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి ఈ డిపోను రెండు బస్సులతో ప్రారంభించారు. ఒక బస్సు

మిగతా 6వ పేజీలో...



కూర్చొనేందుకు బెంచీలైనా లేవు!

బస్‌స్టాండ్ ఆవరణ తగిన ప్లాట్‌ఫాంలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రారంభంలో నిర్మించిన నాలుగు ప్లాట్‌ఫాంలు మాత్రమే ఉన్నాయి. గ్రామీణ రూట్ల బస్సుల ప్లాంట్‌ఫాంలను రేకులతో తాత్కాలికంగా నిర్మించారు. ప్రయాణికులు ఎండుకు ఎండతూ.. వానకు తడుస్తూ బస్సుల కోసం వేచి ఉంటున్నారు. బస్‌స్టాండ్ ఆవరణలో ఆరుబటయ 16ప్లాట్‌ఫాంలు తాత్కాలికంగా నిర్మించినా నాలుగు ప్లాట్‌ఫాంలు అందుబాటులో ఉన్నాయి.


అవార్డును అందుకుంటున్న రాములు

భగవద్గీత పోటీల్లో గోల్డ్ మెడల్

షాద్‌నగర్ అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణ మండలి సభ్యుడు ప్యారసాని రాములు 'గీతా పరివార్' పోటీల్లో బంగారు పతకాన్ని సాధించారు. రిటైర్డ్ టీచర్ రాములు 14ఏళ్ల క్రితం విష్ణు సహస్రనామ పారాయణ మండలిలో చేరారు. ఉత్తరప్రదేశ్ కేంద్రంగా పనిచేస్తున్న గీతా పరివార్ సంస్థ 180దేశాల్లోని వారికి గీతా పారాయణంపై ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణనిస్తోంది. ఏడాది ఆన్‌లైన్ కోర్సులో చేరిన రాములు భగవద్గీతలోని 18 అధ్యాయాలు, 700 శ్లోకాలను కరస్థం చేశారు. శ్లోకాలపై గీతా పరివార్ నిర్వహించిన పోటీల్లో తెలంగాణ నుంచి రాములు విజేతగా నిలిచి బంగారు పతకాన్ని సాధించారు. ఆదివారం ఏపీలోని విశాఖపట్నం స్టీల్‌సిటీ ఎంపీ హాలులో అవార్డులు అందజేశారు.



ఇందిరమ్మ కమిటీల్లో బీఆర్ఎస్ నాయకులా?

తొండుపల్లి కాంగ్రెస్ నాయకుల ఆక్షేపణ


కొత్తగా పార్టీలోకొచ్చిన వారి పెత్తనమేంటని ప్రశ్న

5

రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ ధ్యేయం


వంశీచంద్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు, జూన్ 1(ఆంధ్రజ్యోతి):జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలతో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, పీసీసీ డీలిమిటేషన్ కమిటీ చైర్మన్ చల్లా వంశీచంద్ రెడ్డి పిలుపునిచ్చారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందన్నారు. డీ-లిమిటేషన్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన వంశీచంద్‌రెడ్డిని హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆదివారం ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, కల్వకుర్తి మండలాల కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఆయనను పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. వారితో వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాకాంక్షలకనుగుణంగా పాలన సాగిస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రగతిని ఓర్వలేని విపక్షాలు ప్రభుత్వంపై విషప్రచారం సాగిస్తూ పన్నుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా కాంగ్రెస్ పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికారప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, తలకొండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు రాజేశ్‌రెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, మండ్లీ రాములు, కేశవులు, రవీందర్, ఖాదర్, మైసయ్య, వెంకటేశ్, ఫరీద్, బిక్య తదితరులు పాల్గొన్నారు.



కూలిన కార్యాలయ పైకప్పు

ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు

షాద్‌నగర్ రూరల్, జూన్1(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లోని ఎక్సైజ్ కార్యాలయ పైకప్పు ఆదివారం కూలడంతో విజయ్‌కుమార్ అనే కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం జరుగనున్న రాష్ట్రావతరణ వేడుకలకు కార్యాలయంలో పనులు చేస్తుండగా వరండాలో పైకప్పు పెచ్చులూడి కానిస్టేబుల్‌కు తలపై పడ్డాయి. అతడికి తీవ్ర రక్తస్రావం కావడంతో సిబ్బంది చికిత్స నిమిత్త ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్‌కు తరలించారు. భవనం శిథిలావస్థకు చేరడం వల్లే కూలిందని సిబ్బంది చెప్పారు.

భారంగా విధులు

కొత్త యాప్‌పై పంచాయతీ కార్యదర్శుల అసంతృప్తి

పారిశుధ్య మెరుగుకంటూ కొత్త మార్గదర్శకాలు

15 నెలలుగా అందని నిధులు

యాప్, నూతన నిబంధనలు వద్దంటూ విన్నపాలు



చేవెళ్ల, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం, పచ్చదనం పెంపే లక్ష్యంగా చేపడుతున్న పనులపై రాష్ట్ర ప్రభుత్వం నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. కానీ నిధుల్లేక ఈ నూతన మార్గదర్శకాలతో మరింత భారం మోపుతున్నారని పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు. చేవెళ్ల డివిజన్‌లో 112 పంచాయతీలు ఉన్నాయి. ఐదు రోజులుగా యాప్‌లో హాజరు నమోదు, డెయిలీ శానిటేషన్ రిపోర్టు(డీఎస్ఆర్) అప్‌లోడ్ పనులకు దూరంగా ఉంటున్నారు. విధులకు హాజరవుతూనే మౌన నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాగా నూతన మార్గదర్శకాల ప్రకారం ఇళ్లు, విస్తీర్ణం, అందుబాటులో ఉన్న కార్మికుల సంఖ్య ఆధారంగా పంచాయతీలను

మిగతా 6వ పేజీలో...

మార్పునకు వంద రోజులు

- మున్సిపాలిటీల్లో 100డేస్ యాక్షన్ ప్లాన్
- 50 అంశాలపై కార్యాచరణ
- నేటి నుంచి విభాగాల వారీగా ప్రోగ్రాం

తాండూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): 'ఒక మార్పు - అభివృద్ధికి మలుపు' అనే నినాదంతో వంద రోజుల ప్రోగ్రాంను మున్సిపాలిటీల్లో అమలు చేస్తున్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈకార్యక్రమానికి నేటి నుంచి (సోమవారం) శ్రీకారం చుడుతున్నారు. మున్సిపాలిటీల్లో సమస్యలను పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా మున్సిపల్ స్థాయిలో కార్యాచరణ రూపొందించుకొని అమలుచేయాలని మున్సిపల్ అడ్మిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ టీకే. శ్రీదేవి కమిషనర్‌ను ఆదేశించారు. 100డేస్ యాక్షన్ ప్లాన్‌ను మున్సిపల్ అధికారులు సిద్ధం చేశారు. వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో 50అంశాల ప్రాతిపదికన చేపట్టనున్నారు. శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో మురుగుకాల్వల శుభ్రత, హెల్త్ క్యాంపులు, అంటు వ్యాధులపై ప్రచారం, నాలాల క్లీనింగ్ చేపడుతారు. ఇంకుడు గుంతల నిర్మాణం, పిచ్చిమొక్కల తొలగింపు, పాడైన అంతర్గత రోడ్లకు మరమ్మతులు, తాగునీటి ట్యాంకుల శుభ్రత, దోమల నివారణకు ఫాగింగ్, తడి, పొడి చెత్త సేకరణ, శిథిలావస్థలో భవనాల గుర్తింపు, రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో అసెస్‌మెంట్స్, భవన్ సర్వే, మోటేషన్, కమర్షియల్ భవనాల్లో ట్రేడ్ లైసెన్స్‌లు లేని వాటికి గుర్తింపు చేపడుతారు. నల్లాలను ఆన్‌లైన్ ప్రక్రియ చేపడుతారు. పొదుపు సంఘాలకు రుణాలు, స్కూల్ బిల్డింగ్‌లు, అంగన్‌వాడీలు, కమ్యూనిటీ హాళ్లలో పారిశుధ్యం, తాగునీటి ట్యాంకులక్లోరినేషన్, శుభ్రత వంటి కార్యక్రమాలు చేపడుతారు. వాల్ పెయింటింగ్, జంక్షన్‌ల అభివృద్ధి, వన మహోత్సవం, మెప్మా ఆధ్వర్యంలో ఇంటింటా తడి, పొడి చెత్త వేరు చేయడం, ర్యాలీలు నిర్వహించడం, స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఫుడ్, స్ట్రీట్ వెండర్ తయారు చేసే ఫుడ్‌లతో ఫెస్టివల్ నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపడుతారు.


జూన్ 2న ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం సెప్టెంబర్ 10వ తేది వరకు చేపడుతారు. ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున మున్సిపాలిటీల్లో చేపట్టనున్నారు. అన్ని వర్గాల ప్రజలను ఈకార్యక్రమంలో భాగస్వాములు చేయనున్నారు.






















విద్యార్థులను సన్మానించిన వీరశైవ సమాజం సభ్యులు

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

వికారాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని జగద్ జ్యోతి బసవేశ్వర విద్యాసంస్థ అధ్యక్షుడు బస్వరాజ్ పటేల్ అన్నారు. వికారాబాద్‌లోని శ్రీజగద్ జ్యోతి బసవేశ్వర విద్యాసంస్థ శ్రీ వీరశైవ యువదళ్ వికారాబాద్ ఆధ్వర్యంలో పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందజేసి మాట్లాడారు. నేటి తరం విద్యార్థులు బాగా చదివి సమాజంలో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. మాజీ బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ పదో తరగతిలో 500లకు పైగా మార్కులు సాధించడం గొప్పవిషయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అప్ప విజయ్‌కుమార్, విద్యాసాగర్, బిచ్చప్ప, వీరకాంతం, విశ్వపంతులు, కోటిలింగం, వసంత్, అమర్, భాను, సుధీర్ పటేల్, రాజేశ్, బసవేశ్వర్, శంకర్, సంతోష్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


బీజేపీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న కిషన్‌రెడ్డి

కడ్తాల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిన్న వేములోనిబావి తండాకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఎస్‌టీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. హైదరాబాద్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో వారు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి బీజేపీ కండువాలుకప్పి వారికి పార్టీలోకి స్వాగతించారు. పార్టీలో చేరిన వారిలో నాయకులు దేపావత్ రవినాయక్, వినోద్ నాయక్, అఖిల్ ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్‌రావు, కడ్తాల మండలాధ్యక్షుడు దోనాదుల మహేశ్, బాణావత్ సాయిలాల్ నాయక్, శంకర్‌నాయక్, రెడ్యనాయక్, శ్రీశైలంగౌడ్, నింగ్యారి యాదగిరి, రాందాస్ , కుమార్, శ్రీను, విక్రాంత్, వెంకటేశ్ గౌడ్, లక్ష్మణ్ నాయక్, జంగయ్య పాల్గొన్నారు.

అభివృద్ధిలో కడ్తాలను ఆదర్శంగా నిలుపుతాం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కడ్తాల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఫోర్త్ సిటీకి చేరువలో ఉన్న కడ్తాల మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి ఆదర్శంగా నిలుపుతామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పనకు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తుందన్నారు. కడ్తాల మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, మండల పరిషత్ అసంపూర్తి భవన నిర్మాణాన్ని పూర్తి చేయించి వినియోగంలోకి తేవాలని, 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, 108 అంబులెన్స్, ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయించాలని, మహిళా సమాఖ్యకు భవనం నిర్మించాలని నాయకులు ఈ సందర్భంగా ఆయనను కోరారు. ఈమేరకు ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీతా నర్సింహ, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డిలు స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు సురేందర్ రెడ్డి, కానుగుల దశరథం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట

- టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి


చెక్కులు అందిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులు కల్పించి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆమనగల్లు, కల్వకుర్తి, వెల్దండ మండలాలకు చెందిన 22 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.6.66 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆమనగల్లులోని ఆయన కార్యాలయంలో ఆదివారం లబ్ధిదారులకు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పంతులునాయక్, నరేందర్‌గౌడ్, వెంకట్ నాయక్, శ్రీను నాయక్, కొండల్ యాదవ్, లక్ష్మణ్, తరుణ్, స్వామి, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు మరమ్మతులు

చౌదరిగూడ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారి మధ్యలో సీసీ రోడ్డుపై గుంత ఏర్పడింది. దాంతో కాంట్రాక్టర్ రాజు సీసీ వేసి గుంతను పూడ్చివేశాడు. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో నడిరోడ్డులో గుంత.. ప్రయాణికుల చింత అనే శీర్షికన 27న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఈమేరకు స్పందించిన కాంట్రాక్టర్ పలువురు నాయకులు రోడ్డు మధ్యలో ఉన్న గుంతను ఆదివారం సీసీ వేసి పూడ్చి వేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


సీసీరోడ్డు మధ్యలో గుంతను పూడ్చుతున్న కాంట్రాక్టర్



నకిలీ విత్తనాలను పట్టుకున్న అధికారులు

నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

ఇద్దరు నిందితుల అరెస్టు

షాద్‌నగర్ రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.7.5 లక్షల విలువైన నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నామని షాద్‌నగర్ ఇన్‌చార్జి ఏడీఏ నిషాంత్‌కుమార్ తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన వీర వసంతరావు, జంపాని నాగేశ్వర్‌రావు వికారాబాద్ జిల్లా పరిగిలో నివాసముంటున్నారు. వారు వికారాబాద్ జిల్లా దామచెర్లలో పొలం లీజుకు తీసుకుని నిషేధిత పత్తి విత్తనాలను సాగు చేస్తున్నారు. అంతేకాకుండా వాటిని పక్క రైతులకు కూడా అమ్ముతున్నారు. ఈ నకిలీ విత్తనాలను షాద్‌నగర్ శివారులో పరిగి రోడ్డు పక్కన ముగ్గురు రైతులకు విక్రయిస్తుండగా ఎస్‌వోటీ, షాద్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి 300కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.7.5లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

కేశంపేట, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడాన్ని హర్షిస్తూ ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. కేశంపేట మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మోదీ చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మోటే శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 14 పంటలకు మద్దతు ధర ప్రకటించడం అభినందనీయమన్నారు. సకాలంలో కిసాన్ సమ్మాన్ నిధి సాయం రైతులకు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షురాలు రొల్ల రాధిక, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శేఖర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు విఠల్‌గౌడ్, రఘు రాములుగౌడ్, మహేష్, నరేందర్ రెడ్డి, శ్రీను, దర్శన్, కృష్ణయ్య, యాదయ్య, కృష్ణ, సీల్వేరు లింగయ్య, గోపాల్ తదిరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు బోనాలు

యాచారం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కీజ్‌గూడలో ఆదివారం ఎల్లమ్మ, మార్కమ్మ అమ్మవార్ల ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాదులు నిర్వహించారు. గ్రామస్థులు పూజలు చేసి బోనం సమర్పించారు. కాగా, వడ్డెరలు అమ్మవార్ల ఉత్సవాలను నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్, బీఆర్ఎస్ యాచారం మండల ప్రధాన కార్యదర్శి పి.బాషా ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం

చేవెళ్ల : మండల పరిధిలోని తంగడ్‌పల్లి గ్రామంలో శ్రీ దశావతార సహిత లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి కల్యాణోత్సవం శనివారం రాత్రి కనుల పండుగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం జరిపించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం స్వామివారిని పల్లకీలో ఉంచి వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. గ్రామం గోవింద నామస్మరణతో మార్మోగింది. ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

కందుకూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికులకు సంబంధించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి, కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని రాచులూరు గ్రామంలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం రూ.26వేలతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, ప్రమాద బీమా కింద రూ.10లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటేలా..

(మూడో పేజీ తరువాయి)

వేడుకలు ముగియనున్నాయి. ఉదయం 11.45 గంటలకు తేనేటి విందు ఏర్పాటు చేశారు.

వికారాబాద్‌లో స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించనున్న జిల్లా స్థాయి వేడుకల్లో, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతుండగా, ముందుగా పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించనున్నారు. అనంతరం కలెక్టరేట్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడనున్నారు. అనంతరం అమరుల కుటుంబాలకు సన్మానం, సాంస్కృతిక కార్య



మేడ్చల్ కలెక్టరేట్ ఆవరణలో..

క్రమాలు, గ్రామ పాలన అధికారుల నియామక ఉత్తర్వులు అందించి జిల్లా అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందించనున్నారు. అదేవి



రంగారెడ్డి కలెక్టరేట్ వద్ద..

ధంగా మున్సిపల్, జడ్పీ కార్యాలయం, గ్రంథాలయం, కోర్టు, ఎస్పీ కార్యాలయంతోపాటు ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం తెలంగాణ అవతరణ వేడుకలు నిర్వహించేందుకు అధికారులు అన్ని సిద్ధం చేశారు.

మేడ్చల్‌లో పట్నం మహేందర్‌రెడ్డి

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వ్యాప్తంగా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కలెక్టరేట్‌ను రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఆవిష్కరిస్తారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించి ప్రసగించనున్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే గీతాలపన, లబ్ధిదారులకు ముఖ్య అతిథి చేతులమీదుగా కుట్టు మిషన్లు, రాజీవ్ యువ వికాస మంజూరు పత్రాలు, క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులు, జిల్లాలో పదో తరగతి ఉత్తీర్ణతలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలు, రైతులకు నాణ్యమైన విత్తనాల పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ధాన్యం.. దయనీయం

కొనుగోళ్లలో జాప్యం.. అన్నదాతల అవస్థలు

- కేంద్రాల్లో పేరుకుపోతున్న ధాన్యం నిల్వలు
- కురుస్తున్న వర్షాలు.. ఆందోళనలో రైతులు

బషీరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంతో అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. ధాన్యం అమ్ముకునేందుకు రోజుల తరబడి ఎదురుచూడాల్సిన దయనీయ పరిస్థితి ఎదుర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి రోజులు గడుస్తున్నా సమయానికి తూకం వేసేందుకు హమాలీలు కరువయ్యారు. తీరా వారు వచ్చినా కురుస్తున్న వర్షాలతో కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది. ఇప్పటికే కురిసిన వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. కుప్పల కింద నీరు చేరి మొలకలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సమాయానికి లారీలు రాక తూకం వేసిన ధాన్యం కేంద్రాల్లో పేరకుపోతుండటంతో నిర్వాహకులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

అదనపు దోపిడీ

మిల్లర్లు తాలు పేరుతో బస్తాకు రెండు కిలోల వరకు ఎక్కువ తూకం వేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. తేమశాతం లేదని, ధాన్యం ముక్కిపోయి వస్తుందని లారీలను వెనక్కి పంపిస్తున్నారని నిర్వాహకులు వాపోతున్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు, నిర్వాహకుల మధ్య నిత్యం గొడవలు జరుగుతున్నాయి. ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు, రైసు మిల్లర్ల విషయమై శుక్రవారం నవాంద్గీ సొసైటీ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు కలగకుండా చూస్తానని, మిల్లర్లతో మట్లాడి రైతుల ధాన్యం కొంటామని చెప్పినట్లు వారు పేర్కొన్నారు.



మైల్వార్ వద్ద రోడ్డుపై తూకాలు జరుగక ధాన్యం నిల్వలు

30 వేలకు పైగా ధాన్యం నిల్వలు

మండలంలోని మైల్వార్, దామర్‌చెడ్, నవాంద్గీ, నవాల్గలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో, శీంపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేపట్టారు. ఆయా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు జరుగుతున్నా నేటికి 30 వేలకు పైగా ధాన్యం బస్తాలు నిల్వ ఉన్నాయని నిర్వాహకులు చెబుతున్నారు. ఓ పక్క వర్షాలు కురుస్తుండటంతో ధాన్యాన్ని కాపాడుకోలేక రైతులు పడారని పాట్లు పడుతున్నారు. అయితే రైసు మిల్లులు ధాన్యంతో నిండిపోయాయని, ధాన్యం తీసుకోలేమని మిల్లర్లు చేతులెత్తేస్తున్నారని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాండూరు ప్రాంతంలో బాయిల్డ్ రైస్ మిల్లులు రెండు ఉండటంతో స్టాక్ పేరుకుపోయిందని సమాచారం. ఈ క్రమంలో సంగారెడ్డిలోని రైసు మిల్లులకు ధాన్యం పంపిస్తున్నట్లు కేంద్రాల నిర్వాహకులు చెబుతున్నారు.

ఆలస్యం చేస్తున్నారు



నాకు ఐదెకరాల పొలం ఉంది. 25 రోజుల కిందట వరి కోసి ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చాను. ఇప్పటివరకు తూకం వేయలేదు. హమాలీలు రాలేదని ప్రారంభంలో ఆలస్యం చేశారు. తేమశాతం సరిగా ఉన్నా తూకాలు వేయడంలేదు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

\- కుర్వ శివప్ప, రైతు మైల్వార్

ఎప్పుడు కొంటారో..



నాకున్న రెండెకరాల్లో వరి పండించి ధాన్యాన్ని కొనుగోలు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చాను. కొనుగోళ్లలో జాప్యం జరుగుతుండడంతో రోజూ ధాన్యాన్ని ఆరాబెట్టి, కుప్పలు కడుతున్నాము. ఇప్పటికైనా వడ్లు కొనుగోలు చేయాలి. వర్షాలకు వడ్లు తడుస్తాయేమోనని నిద్ర పట్టడంలేదు.

\- నర్సమ్మ, రైతు, మైల్వార్



చేగుర్‌లో క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్, శివశంకర్‌గౌడ్

కాంగ్రెస్ పాలనలో పేదలకు న్యాయం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు న్యాయం జరుగుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం నందిగామ మండలంలోని వెంకమ్మగూడ, చేగుర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలసి భూమిపూజ చేసి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామన్నారు. గత పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు కనీసం ఒక్క ఇళ్లు కూడా నిర్మించలేదని అన్నారు. కార్యక్రమాల్లో నాయకులు జంగ నర్సింలు, శివశంకర్‌గౌడ్, సాములయ్య, వీరేందర్, మంకాల శ్రీశైలం, ఆవుల శివ, గుండాల వేణు, మీసేవ నర్సింలు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో రాణించాలి

గ్రామీణ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండల పరిధిలోని చేగుర్‌లో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న చేగుర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే శంకర్, శివశంకర్‌గౌడ్ ప్రారంభించారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న శివశంకర్‌గౌడ్‌ను ఆయన అభినందించారు. నాయకులు జంగ నర్సింహ, శేఖర్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, కావలి కృష్ణ, శ్రీశైలం, సాములయ్య, శివ, కుమార్, సురేష్, శేఖర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీల్లో బీఆర్ఎస్ నాయకులా?

శంషాబాద్ రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ కమిటీల్లో బీఆర్ఎస్ నాయకులకు చోటు ఎలా కల్పిస్తారని మున్సిపల్ పరిధిలోని తొండుపల్లి కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. ఈమేరకు ఆదివారం తొండుపల్లిలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన మాజీ కౌన్సిలర్ రాణి, కుమారుడు ప్రవీణ్‌గౌడ్ పెత్తనమేంటని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఉపాధ్యక్షుడు బాత్కు నర్సింహ యాదవ్ ప్రశ్నించారు. సీనియర్ నాయకులుగా ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడ్డా మాకు కమిటీలో చోటు కల్పించడం లేదు కానీ, నిన్న మొన్న కాంగ్రెస్‌లోకి వచ్చి వారికి ఇందిరమ్మ కమిటీలో చోటు కల్పించడం మంచి పద్ధతి కాదన్నారు. మంద రవి అనే వ్యక్తి ఇప్పటికీ బీఆర్ఎస్‌లో ఉన్నాడని.. ఆయనకు కమిటీలో ఎలా చోటు కల్పిస్తారని ప్రశ్నించారు. ఇందిరమ్మ కమిటీలో పాత కాంగ్రెస్ నాయకులకు చోటు కల్పించాలని కోరారు. పాత, కొత్త నాయకులను కలుపుకొని పోవాలని సూచించారు. ప్రవీణ్‌గౌడ్ ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీలో చేరలేదని, కమిటీలో చోటు కల్పించారని విమర్శించారు. గత ఎన్నికల్లో మేము ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చాం.. ఇప్పుడు పార్టీలో లేనివారు వచ్చి వారు చెప్పిన వాళ్లకే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని కాలనీ వాసులకు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పెద్దల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పరమేష్, 10వ వార్డు అధ్యక్షుడు తుప్పర అశోక్, నర్సింహ, ఖదీర్, టి.నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సాఫీగా రిజిస్ట్రేషన్

- 15 నిమిషాల్లో ప్రక్రియ పూర్తి
- నేటి నుంచి స్లాట్ బుకింగ్స్
- అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు

మేడ్చల్ ప్రతినిధి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నేటి నుంచి స్లాట్ బుకింగ్ విధానం తప్పనిసరి కానుంది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది. గత నెల 10వ తేదీన రాష్ట్రంలో 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ప్రారంభించారు. జిల్లాలో మొదటి దశలో మూడు కార్యాలయాల్లో, రెండో దశలో ఐదు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ విధానాన్ని ప్రవేశపెట్టారు. జిల్లాలో మొత్తం 12 కార్యాలయాలుండగా ఇప్పటివరకు ఎనిమిది కార్యాలయాల్లో స్లాట్ విధానం ప్రారంభమైంది.



మిగిలిన నాలుగు కార్యాలయాల్లో కూడా నేటి నుంచి ప్రారంభం కానుంది.

రోజుకు 50 స్లాట్స్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు ఉంటారు. ఈ లెక్కన ప్రతి రోజు వంద డాక్యుమెంట్ల వరకు స్లాట్ బుకింగ్‌కు అవకాశం ఉంటుంది. అయితే రోజూ 50 స్లాట్స్ వరకు కేటాయిస్తారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసేందుకు ఈ విధానం ఉపయోగపడుతుంది. స్లాట్ బుక్ చేసుకుని కార్యాలయాలకు వెళ్తే 15 నిముషాల్లో ప్రక్రియ పూర్తవుతుంది. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్స్‌లో స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు.

గ్రూపు రిజిస్ట్రేషన్లకు వెసులుబాటు

స్లాట్ బుకింగ్ విధానంలో బిల్డర్లకు గ్రూపు రిజిస్ట్రేషన్ వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. బిల్డర్ కోసం ప్రత్యేకంగా ఒక మాడ్యుల్‌ను రూపొందించారు. రిజిస్ట్రేషన్ చేసుకునే వారు వెబ్‌సైట్‌లో తప్పులు లేకుండా డాటాను ఎంట్రీ చేయాలి. స్లాట్ బుకింగ్ విధానంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ త్వరగా పూర్తవుతుంది. ఎక్కువ సేపు కార్యాలయాల్లో వేచి చూడాల్సిన అవసరం ఉండదు.

\- అశోక్, జిల్లా రిజిస్ట్రార్

అన్నివర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల/మొయినాబాద్ రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ముడిమ్యాల్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం రాష్ట్రంలోని అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. ముడిమ్యాల్ గ్రామంలో మొదటి విడతలో 18 మందికి ఇళ్లు మంజూరు చేశామన్నారు. పార్టీలకతీతంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చింపుల సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, మాజీ సర్పంచ్‌లు పి.ప్రభాకర్, శైలజా ఆగిరెడ్డి, మధుసూన్‌గుప్తా, వెంకటేశంగుప్తా, స్వరూప, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కృష్ణారెడ్డి, రాములు, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జనార్దన్ పాల్గొన్నారు. అలాగే మొయినాబాద్ మండల పరిధిలోని మేడిపల్లి, వీరన్నపేట, హిమాయత్ నగర్, అమ్డాపూర్ గ్రామాల్లో నిర్మించబోయే ఇందిరమ్మ ఇళ్లకు ఎమ్మెల్యే యాదయ్య, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డిలు భూమిపూజ చేసి ప్రొసీడింగ్స్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదోడి సొంతింటి కలలు సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్, మేనేజర్ జమీల్, పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్,



చేవెళ్ల : ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

కాలె శ్రీకాంత్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఎల్గపల్లి శ్రీనివాస్ యాదవ్, నరేష్ ముదిరాజ్, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటేష్, సంధ్య, పాల్గొన్నారు.

హామీల అమలే లక్ష్యం

కందుకూరు : ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు బొక్క సంజీవరెడ్డి, ఎస్ శేఖర్‌గౌడ్, ఎండీ ఖదీర్, బుక్క పాండురంగారెడ్డిలు తెలిపారు. మండలంలోని కొత్తగూడ, పులిమామిడి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కుమ్మరి కృష్ణయ్య, బొక్క దేవేందర్‌రెడ్డి, బొక్క నరేందర్‌రెడ్డి, బొక్క దామోదర్‌రెడ్డి, ఎం.రమేష్, బుక్క మహేందర్‌రెడ్డి, పి.రవీందర్, పి.మహేశ్, రవి, సామేల్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నాలుగున్నర తులాల బంగారు పుస్తెలతాడు అపహరణ

● వృద్ధురాలి మెడలోంచి లాక్కెళ్లిన దుండగుడు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ రాజు, సీఐ జగదీశ్

ఇబ్రహీంపట్నం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఆకుకూరలు అమ్ముకుని ఇంటికి వెళ్తున్న ఓ వృద్ధురాలి మెడలోంచి గుర్తుతెలియని దుండగుడు సినీ ఫక్కీలో నాలుగున్నర తులాల బంగారు పుస్తెలతాడును అపహరించుకుపోయిన ఘటన ఆదివారం ఉదయం ఇబ్రహీంపట్నం టౌన్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మంచాల మండలం నోముల గ్రామానికి చెందిన మాదరమోని లక్ష్మమ్మ(70) రోజులాగే ఆదివారం ఉదయం ఇబ్రహీంపట్నం టౌన్ పాత పోలీస్ క్వార్టర్స్ వద్ద ఆకుకూరలు తెచ్చి విక్రయించింది. ఇంటికి తిరిగి వెళ్లేక్రమంలో కాలినడకన బస్టాండుకు వెళ్తుండగా మార్గమధ్యలో ఓ దుండగుడు ఆమె మెడలో ఉన్న నాలుగున్నర తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పరారయ్యాడు. విషయం తెలుసుకున్న ఏసీపీ కేవీపీ రాజు, సీఐ జగదీశ్‌లు ఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. బాధితురాలు లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్..

ఒకరు మృతి మరొకరికి తీవ్ర గాయాలు

ఆమనగల్లు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఆమనగల్లు పట్టణ సమీపంలోని ముర్తూజపల్లి గేటు వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఈ సంఘటన చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల మేరకు... నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలానికి చెందిన రాయకంటి కృష్ణయ్య, అతని బంధువు రొట్టె శేఖర్‌తో కలిసి ఆదివారం ఉదయం బైక్‌పై హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఆమనగల్లు మండలం ముర్తూజపల్లి గేటు వద్ద బాలకృష్ణ అనే వ్యక్తి అతివేగంగా ట్రాక్టర్ నడుపుకుంటూ వచ్చి బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న రాయకంటి కృష్ణయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న శేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో దూకి యువతి గల్లంతు



రేష్మ

ఇబ్రహీంపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఆదివారం సాయంత్రం ఇబ్రహీంపట్నం చెరువులో దూకి ఓ యువతి గల్లంతైంది. కాగా, గాలింపు చర్యలు చేపట్టినా ఆమె మృతదేహం లభ్యం కాలేదు. పోలీసుల కథనం ప్రకారం హైదరాబాద్ ఫలక్‌నూమాకు చెందిన రేష్మ (24) అనే యువతి ఆదివారం ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై ఉన్న ఇబ్రహీంపాషా దర్గాను సందర్శించింది. కాగా చెరువు పెద్ద తూము వద్ద నీటిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టినా మృతదేహం లభ్యం కాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసికొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

షాద్‌నగర్ రూరల్, జూన్1(ఆంధ్రజ్యోతి): ఫరూక్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామంలోని నర్సింలుకు చెందిన పాడి ఆవు ఆదివారం విద్యుదాఘానికి గురై మృతి చెందింది. బాధితుడి కథనం ప్రకారం.. సాయంత్రం 5గంటల ప్రాంతంలో గ్రామ సమీపంలో మేత మేస్తూ ఆవు ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరికి వెళ్లింది. ఈక్రమంలో అక్కడ విద్యుత్ వైర్లు ఆవుకు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. కాగా, మృతిచెందిన ఆవు విలువ రూ.35 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

యాచారం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యమైన ఘటన యాచారం మండల పరిధిలోని నల్లవెల్లిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన మమత(29) కూలి పనికి వెళుతున్నట్లు భర్త శేఖర్‌కు చెప్పి ఇంటి నుంచి మే 30న బయటకు వెళ్లింది. అదే రోజు రాత్రి వరకూ కూడా ఆమె ఇంటికి రాలేదు. మరుసటి రోజు బంధువులు, చుట్టుపక్కల ఇళ్లలో ఆరా తీయగా కనిపించలేదు. ఆమె ఫోన్‌కు కాల్‌చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. మమత ఎత్తు ఐదు అడుగులు ఉంటుందని, గోధుమ రంగు చర్మం, లైట్ పింక్ కలర్ చీర ధరించి ఉందని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎ.నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

50 ఏళ్లవుతున్నా.. అభివృద్ధికి నోచని బస్‌స్టాండ్

(మూడో పేజీ తరువాయి)



బస్‌స్టాండ్ ఆవరణలో వాహనాల పార్కింగ్

హైదరాబాద్-మహబూబ్‌నగర్ మధ్య నడవగా.. మరో బస్సు రోజుకు రెండు ట్రిపుల చొప్పున మధురాపూర్, రేగడి చిలుకమర్రి గ్రామాలకు తిరిగేది. తర్వాత క్రమంగా ఈ డిపోకు వంద బస్సులు వచ్చాయి. నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు ఈ డిపో బస్సులు తిరుగుతున్నాయి. హైదరాబాద్ కు ప్రతి 15నిమిషాలకు, మహబూబ్‌నగర్‌కు ప్రతి అర్ధగంటకో బస్సు నడిపేవారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో రోజుకు రూ.16లక్షల నుంచి రూ.18లక్షల వరకు ఆదాయంతో అధిక రాబడి ఉన్న డిపోగా షాద్‌నగర్ డిపో పేరు తెచ్చుకుంది. అలాంటి డిపో పరిస్థితి ఇప్పుడు దయనీయంగా ఉంది. డిపోకు డ్రైవర్ల కొరతా వేధిస్తోంది. ప్రస్తుతం ఉన్న బస్సుల సంఖ్యకు 115మంది డ్రైవర్లు కావాల్సి ఉంది. అయితే 98 మంది డ్రైవర్లే ఉన్నారు. దీంతో సమయానికి బస్సులు బయల్దేరడం లేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

25వేల మంది ప్రయాణికుల రాకపోకలు

షాద్‌నగర్ బస్‌స్టాండ్ నుంచి రోజూ 88 బస్సుల్లో 33వేల కిలోమీటర్ల పరిధిలో వివిధ రూట్లలో 25వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా ప్లాట్‌ఫాంలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ముందు వరకు రోజుకు ఈ డిపోలో రూ.16లక్షల నుంచి రూ.18లక్షల ఆదాయం సమకూరేది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుతో రోజుకు రూ.6లక్షల నుంచి రూ.7లక్షలే వస్తోంది. బస్‌స్టాండ్ ఆవరణలోని షాపింగ్ కాంప్లెక్స్‌లతో నెలకు లక్షలాది రూపాయల రాబడి వస్తున్నా ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించేందుకు మాత్రం ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. హైవేపై ఉన్న ఇంత ప్రధాన బస్టాండ్ నిరాదరణకు గురవుతోంది. బస్‌స్టాండ్ ఆవరణలో నీళ్లు తాగడానికి ఒక గ్లాస్ కూడా ఏర్పాటు చేయలేదు. పాతబడిన ప్లాస్టిక్ డబ్బాను వాటర్ మిషన్‌కు దానితో నీరందిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పట్టించుకుంటేనే సమస్యలు తీరుతాయని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.

బస్‌స్టాండ్ ఆవరణలోనే పార్కింగ్

డిపోలో పార్కింగ్ స్థలంలేక బస్టాండ్ ఆవరణనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో బస్సులు మలపడానికి డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు ఒక బస్సుకు మరో బస్సు రాసుకుంటున్న సందర్భాలున్నాయి. షాద్‌నగర్ మునిసిపాలిటీలో ప్రభుత్వానికి సంబంధించి కార్యాలయాలు, ఆర్‌అండ్‌బీ రోడ్లు, పార్కులు తదితర ప్రజావసరాలు, మౌలిక సదుపాయాల్లో ఎంతో మెరుగుదల వచ్చినా అభివృద్ధికి నోచుకోనిది ఏదైనా ఉందంటే అది బస్టాండే!

విస్తరించాల్సిన అవసరం ఉంది



పెరిగిన ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్‌స్టాండ్ ఆవరణను విస్తరించాల్సి ఉంది. ఈ సమస్యపై ఆర్టీసీ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఐదో నంబర్ ప్లాట్‌ఫాం మొదలుకుని చెవేళ్ల ప్లాట్‌ఫాం వరకు విస్తరించాలి. ప్లాట్‌ఫాంలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. డిపోలో ఇన్‌కమింగ్, అవుట్ గోయింగ్ సదుపాయం లేకడ్రైవర్లు కూడా ఇబ్బందులకు గురవుతున్నారు. బస్‌స్టాండ్ నుంచి హైదరాబాద్, మహబూబ్‌నగర్ ప్రధాన రోడ్లపైకి బస్సు వెళ్లాలంటే 10 నిమిషాలకుపైగా సమయం పడుతోంది. ఇలా బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాల్సి ఉంది.

- ఉష, ఆర్టీసీ షాద్‌నగర్ డిపో మేనేజర్



ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేస్తున్న డీఆర్వో వెంకటాచారి, బూడిద రాంరెడ్డి తదితరులు

పట్టుదలతో ముందుకెళితే మంచి ఫలితాలు

ఇబ్రహీంపట్నం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని పట్టుదలతో ముందుకుపోతే మంచి ఫలితాలు వస్తాయని హైదరాబాద్ డీఆర్వో వెంకటాచారి అన్నారు. ఆదివారం ఉప్పరిగూడలోని కేఎంఆర్ గార్డెన్స్‌లో ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన 120 మంది విద్యార్థులకు బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి నగదు పురస్కారాలు అందజేశారు. వెంకటాచారి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని.. అందులో చదివే విద్యార్థుల్లో ప్రతిభ వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. బీఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా ఉప్పరిగూడతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూనే ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించడమనేది మంచి పరిణామమన్నారు. బూడిద రాంరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాల్సిన అవసరముందన్నారు. ముఖ్యంగా దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. కేవలం ఉద్యోగాల కోసం గాకుండా పది మందికి ఉపాధి చూపించే స్థాయికి ఎదిగినప్పుడే తల్లిదండ్రులు, సమాజం గర్విస్తుందన్నారు. కార్యక్రమంలో ద మిషన్ ఫౌండర్ చైర్మన్ ఏడుకొండలు, పంచాయతీరాజ్ కమిషనరేట్ అధికారి జి.నరేందర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ సీఐ వెంకట్‌రెడ్డితోపాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, టీచర్లు పాల్గొన్నారు.

సీసీ జైపాల్‌రెడ్డి సేవలు అమోఘం



జైపాల్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న డీఆర్‌డీఏ పీడీ, అదనపు పీడీ

రంగారెడ్డి అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన మంచాల కమ్యూనిటీ కోఆర్డినేటర్ కె.జైపాల్‌రెడ్డి-గీత దంపతులను డీఆర్డీఏ పీడీ శ్రీలత, అదనపు పీడీ సూర్యారావు ఆదివారం కలెక్టరేట్‌లో ఘనంగా సన్మానించారు. జైపాల్‌రెడ్డి సేవలను అమోఘమని కొనియాడారు. కార్యక్రమంలో డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవానికి ప్రభుత్వ పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా కార్యాలయాలను అధికారులు అందంగా ముస్తాబు చేశారు. ఈమేరకు కందుకూరు మండల కేంద్రంలోని ఆర్డీవో ఆఫీసును అధికారులు రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు.
- కందుకూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి)



ఎంపీ మల్లు రవికి ఘన స్వాగతం



ఎంపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఆమనగల్లు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవికి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. టీపీసీసీ క్రమ శిక్షణ కమిటీ చైర్మన్‌గా నియమితులై ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న మల్లు రవికి శంషాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బ్యాండ్ వాయిద్యాలతో ఎదురేగి స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, యాట నర్సింహ, గుర్రం కేశవులు, మండ్లీ రాములు, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చేగూరి వెంకటేశ్, బీచ్యనాయక్, ఫరీద్, జగన్, ఖాదర్, రవీందర్‌నాయక్, చంద్రు నాయక్, పర్వత్‌రెడ్డి, మోతీలాల్, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, నాజర్, బద్ది వెంకటేశ్, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవల్లో లయన్స్‌క్లబ్‌కు అంతర్జాతీయ ఖ్యాతి



అంబలి పంపిణీ చేస్తున్న చెన్నకిషన్ రెడ్డి

కడ్తాల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల నిర్వాహణలో లయన్స్‌క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో అగ్రభాగాన నిలిచిందని లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జి. చెన్నకిషన్‌రెడ్డి అన్నారు. సేవాభావం కలిగిన వారికే క్లబ్‌లో చోటు ఉంటుందని ఆయన అన్నారు. కడ్తాల మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబలి కేంద్రాన్ని ఆదివారం చెన్నకిషన్‌రెడ్డి సందర్శించారు క్లబ్ సభ్యులతో కలిసి ప్రజలకు అంబలి పంపిణీ చేశారు. ఫిబ్రవరి 12న ప్రారంభించిన అంబలి కేంద్రం జూన్ 12 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రతీరోజు 400 మందికి అంబలి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి దోనాదుల మహేశ్, పీఆర్‌వో పాష, సభ్యులు చేగూరి వెంకటేశ్, వేణుగోపాల్, గోవర్దన్ రెడ్డి, లక్ష్మయ్య, రాజేశ్, గంప శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భారంగా విధులు

(మూడో పేజీ తరువాయి)

రెండు, నాలుగు, ఆరు జోన్లుగా విభజించనున్నారు. జోన్ల వారీగా రొటేషన్ విధానంలో పనులు చేపట్టి పారిశుధ్య మెరుగునకు చర్యలు తీసుకోనున్నారు. ప్రతీ జోన్ లోనూ నిర్దేశిత తేదీల్లో ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరించి తడి, పొడి వ్యర్థాలను వేరు చేయడం, డ్రెయిన్లలో పూడిక తొలగింపు, రోడ్ల శుభ్రత వంటి పనులు చేయాలి.

మరింత భారంగా నూతన యాప్ నిర్వహణ

ఇప్పటి వరకు కార్యదర్శులు పంచాయతీ కార్యాలయం వద్ద సెల్ఫీ దిగి జీపీ మానిటరింగ్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే అటెండెన్స్ నమోదవుతోంది. ప్రస్తుతం ఈ యాప్‌ను నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా మార్చారు. కార్యదర్శులు ఉదయం 8గంటలకు విధులకు హాజరై పంచాయతీ కార్యాలయంలో ఫేస్ రికగ్నేషన్‌తో యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. రోజూ ఎన్ని ఇళ్ల నుంచి చెత్తసేకరించారు. తడి, పొడి చెత్త ఎంతో తూకం వేసి అప్‌లోడ్ చేయాలి. ఇందుకు తక్కెడ కొనాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. తూకం వేసి విక్రయించిన చెత్త ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ జనరల్ ఫండ్‌లో జమ చేసి చలానాను యాప్‌లో అప్ లోడ్ చేయలి.

ఉద్యోగులకు అప్పుల తిప్పలు

పంచాయతీల్లో పాలకవర్గాల్లేక 15 నెలలుగా నిధులు రావడం లేదు. దీనికి తోడు అకౌంట్ల ఫ్రీజింగ్‌తో పన్నుల రూపంలో వసూలైన నిధులనూ వాడుకోలేని పరిస్థితి ఉంది. దీంతో నిర్వహణ వ్యయం లేక కొన్ని పంచాయతీల్లో చెత్త సేకరణ ట్రాక్టర్లు మూలన పడ్డాయి. కొన్ని గ్రామాల్లో కార్యదర్శులు అప్పుచేసి పనులు చేయిస్తున్నారు. ఇప్పటి వరకు డివిజన్‌లో గ్రామ పనులకు రూ.4లక్షల వరకు అప్పు చేశామని ఆయా గ్రామాల కార్యదర్శులు పేర్కొంటున్నారు.

నూతన విధానంపై అసంతృప్తి

నూతన మార్గదర్శకాలు, యాప్‌పై కార్యదర్శులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ప్రతినిధులు ఆరు రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇచ్చారు. నిధులందక ఇబ్బంది పడుతున్న తమకు నూతన మార్గదర్శకాలు మరింత భారం అవుతాయని తెలిపారు. చెత్తసేకరణ, తూకం వేయడం, విక్రయించడం, యాప్‌లో అప్లోడ్, ఫేస్ రికగ్నేజేషన్ వంటివి తమ శక్తికి మించిన పనులని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన మార్గదర్శకాల అమలు చేయాలంటే పంచాయతీలకు నిధులు మంజూరుచేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రతీ 50మంది జనాభాకు ఒక పారిశుధ్య వర్కర్‌ను నియమించాలని, 5జీ స్పీడ్‌తో కలిగిన సెల్‌ఫోన్ ఇవ్వాలని, నిర్వహణకు ప్రతీనెల రూ.వెయ్యి చెల్లించాలని కార్యదర్శుల సంఘం నేతలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కొత్త యాప్‌తో పనిభారం!

రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త యాప్‌తో పంచాయతీ కార్యదర్శుల పనిభారం పెరుగుతుంది. పంచాయతీ రాజ్ శాఖలో ఎవరికీ లేని అటెండెన్స్ యాప్‌ను పంచాయతీ కార్యదర్శులకు అమలుచేయడం సరికాదు. ప్రభుత్వం తక్షణమే నూతన యాప్‌ను రద్దు చేయాలి. పెండింగ్‌లో ఉన్న పంచాయతీ నిధులను విడుదల చేయాలి.

- శివకుమార్, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు, చేవెళ్ల

PUBLIC NOTICE

The General Public is hereby informed that my clients **1. KOYA HARISHU,** S/o. Koya Prasad Rao, Occ: Business, **2. KOYA NAGAMANI,** W/o. Koya Prasad Rao, both are R/o. Flat No.304, Classic Towers, Ist lane, Rajendra Nagar, Guntur, Andhrapradesh, have entered into an agreement of sale dt.18-12-2024 to purchase the below mentioned schedule property from **SRI MADUGULA ANAND KUMAR,** S/o. Madugula Rajeshwar Sharma, R/o. H.No.7-3,Singaram Village, Yacharam Mandal, Ranga Reddy District. That my clients also paid substantial amount towards advance sale consideration and intend to go for regular Registered Sale Deed in respect of the schedule property.

Therefore I hereby call upon the General Public that, if any, person(s) have got any title, claim Prior agreements or objections in respect of the above transaction for the sale of schedule property, then they may approach the under signed within **TEN DAYS** from the date of this publication along with relevant documents. If no claims or objections received within the stipulated time, then my clients shall proceed to get the Registered Sale Deed, and there after no claims will be entertained.

SCHEDULE PROPERTY

All that the land in Sy.No.646/1/3, admeasuring Ac.1-00 Gts equallent to 4840 Square Yards, situated at NANDIWANAPARTHY Revenue Village, Yacharam Mandal, Ranga Reddy District, and bounded by:

NORTH : Land of Uppala Anjamma.
SOUTH : Land of V. Pongaiah and 646 Part.
EAST : Land of Ganta Fruts.
WEST : Road to Tadiparthy to Nnadhiksingaram.

Sd/- S. MURALI GOUD, ADVOCATE
H.No. 6-54, Kandukur X road
Kandukur Mandal, Ranga Reddy Dist.
Telangana State-501359
Cell No. 9948872977

PUBLIC NOTICE

The General Public is hereby informed that my clients **1. KOYA HARISHU,** S/o. Koya Prasad Rao, Occ: Business, **2. KOYA NAGAMANI,** W/o. Koya Prasad Rao, both are R/o. Flat No.304, Classic Towers, 1st lane, Rajendra Nagar, Guntur, Andhrapradesh, have entered into an agreement of sale dt.18-12- 2024 to purchase the below mentioned schedule property from **SAMA DHARANIDHAR REDDY,** S/o. SAMA RANGA REDDY, R/o Durga Bhavani Nagar, Ranga Reddy district. That my clients also paid substantial amount towards advance sale consideration and intend to go for regular Registered Sale Deed in respect of the schedule property.

Therefore I hereby call upon the General Public that, if any, person(s) have got any title, claim Prior agreements or objections in respect of the above transaction for the sale of schedule property, then they may approach the under signed within **TEN DAYS** from the date of this publication along with relevant documents. If no claims or objections received within the stipulated time, then my clients shall proceed to get the Registered Sale Deed, and there after no claims will be entertained.

SCHEDULE PROPERTY

All that the agricultural land in Sy.No.646/A/ 1/ 1/ 1/ 1, admeasuring Ac.0-20 Gts and in Sy.No.646/A/1/1/1/2, admeasuring Ac.0-20 Gts, total admeasuring Ac.1-00 Gts, situated at NANDIWANAPARTHY Revenue Village, Yacharam Mandal, Ranga Reddy District, and bounded by:

NORTH : Land of Uppala Anjamma.
SOUTH : Land of V. Pongaiah and 646 Part.
EAST : Land of Ganta Fruts.
WEST : Road to Tadiparthy to Nnadhiksingaram.

Sd/- S. MURALI GOUD, ADVOCATE
H.No. 6-54, Kandukur X road
Kandukur Mandal, Ranga Reddy Dist.
Telangana State-501359
Cell No. 9948872977

PUBLIC NOTICE

The General Public is hereby informed that my clients **1. KOYA HARISHU,** S/0. Koya Prasad Rao, Occ: Business, **2. KOYA NAGAMANI,** W/o. Koya Prasad Rao, both are R/o. Flat No.304, Classic Towers, 1st lane, Rajendra Nagar, Guntur, Andhrapradesh, have entered into an agreement of sale dt.18-12- 2024 to purchase the below mentioned schedule property from **SRI G.KONDAL REDDY,** S/o. G.NARSIMHA REDDY, R/o. R N Reddy Nagar, Karmanghat, R.R. District. That my clients also paid substantial amount towards advance sale consideration and intend to go for regular Registered Sale Deed in respect of the schedule ProPerty. Therefore I hereby call upon the General Public that, if any. person(sl have got any title, claim Prior agreements or objections in respect of the above transaction for the sale of schedule property, then they may approach the under signed within TEN DAYS from the date of this publication along with relevant documents. If no claims or objections received within the stipulated time, then my clients shall proceed to get the Registered Sale Deed, and there after no claims will be entertained.

SCHEDULE PROPERTY

All that the land in Sy.No.646/A/3, admeasuring Ac.0-31 Gts in Sy.No.646/A/1/3, admeasuring Ac.1-00 Gts, in Sy.No.646/A1/1/3 admeasuring Ac.0-30 Gts, in Sy.No.646/3, admeasuring Ac.1-31 Gts in Sy.No.646/1/2, admeasuring Ac.0-30 Gts, total admeasuring Ac.5- 02 Gts, equaling to 24,442 Square Yards, situated at NANDIWANAPARTHY Revenue Village, Yacharam Mandal, Ranga Reddy District, and bounded by:

NORTH : Land of Vuppala Bhaskar and others.
SOUTH : Land 646 Part.
EAST : Land of Ganta Fruits.
WEST : Road to Tadiparthy to Nnadhiksingaram

Sd/- S. MURALI GOUD, ADVOCATE
H.No. 6-54, Kandukur X road
Kandukur Mandal, Ranga Reddy Dist.
Telangana State-501359
Cell No. 9948872977

217వ రోజుకు చేరిన రిలే దీక్షలు

తలకొండపల్లి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం గట్టిప్పలపల్లి గ్రామస్థులు కదం తొక్కారు. నెలల కాలంగా జేఏసీ ఆధ్వర్యంలో దీక్షలు చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. 11 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 217వ రోజుకు చేరాయి.

మెడికల్ కిట్ల పంపిణీ

తలకొండపల్లి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హర్యానాయక్ తండాలో ఆదివారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు మెడికల్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ, ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ కిట్లను సమకూర్చారు. స్థానిక నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు వాటిని పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ రఘుపతి నాయక్, మాజీ ఉప సర్పంచ్ నారాయణ, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, నాయకులు లచ్య, కృష్ణనాయక్, నరేశ్, మల్లేశ్, శివ పాల్గొన్నారు.

కరాటే కిక్ ప్యాడ్లు అందజేత

చౌదరిగూడ : కొందుర్గు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవరణలో కొనసాగుతున్న వేసవికాలం ఉచిత కరాటే శిక్షణలో భాగంగా విద్యార్థులకు కరాటే కిక్ ప్యాడ్లు అందజేశారు. కొందుర్గు మాజీ వైస్ఎంపీపీ రాజేష్‌పటేల్, మాజీ ఉప సర్పంచ్ శుకూర్‌లు విద్యార్థులకు కరాటే కిక్ ప్యాడ్లు అందజేశారు. కార్యక్రమంలో మాణయ్య, మాస్టర్లు శివ, రాజు, నర్సింహులు తదతరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలి

ఆమనగల్లు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వంతో పాటు దాతలు ముందుకు రావాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్ కోరారు. చెన్నంపల్లికి చెందిన కల్లు విక్రమ్ రెడ్డి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.40 వేలు సమకూర్చారు. 4 సీసీ కెమెరాలను కొనుగోలు చేసి జగన్‌తో కలిసి స్థానిక పోలీసు స్టేషన్ లో విక్రమ్ రెడ్డి అందజేశారు. విక్రమ్ రెడ్డిని స్థానికులు, పోలీసులు అభినందించారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, నాయకులు రమణ, తిరుపతయ్య,విజయేందర్, శ్రీధర్, కృష్ణ, శ్రీకాంత్, మహేశ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ విజయశాంతికి సన్మానం



కడ్తాల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారిణి, ఎమ్మెల్సీ విజయశాంతిని కడ్తాల మండలానికి చెందిన కల్వకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్ ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో విజయశాంతిని కలిసి సత్కరించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించినట్లు షాబుద్దీన్ తెలిపారు. పస్పుల శ్రీకాంత్, కొప్పు విజేందర్ ఉన్నారు.

కాంగ్రెస్ నేతల సంబురాలు

ఆమనగల్లు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి నియామకం పట్ల ఆమనగల్లు పట్టణంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, కాంగ్రెస్ జిల్లా నాయకులు మండ్లీ రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు స్వాగతం పలకడానికి వెళ్లారు. జిల్లా, మండల నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ నాయక్, శ్రీరాములు, శ్రీను నాయక్, రఫీ, ఖాదర్‌ఖాద్రి, బద్ది వెంకటేశ్, మైసయ్య, నర్సింహ్మా, నాజర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నిత్యశుద్ధానందస్వామి పుణ్యారాధనోత్సవం

ఆమనగల్లు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని శ్రీ నిత్యశుద్ధానంద స్వామి క్షేత్రం, శ్రీ రామదూత ఆశ్రమంలో నేడు(సోమవారం) 130వ విష్ణు సహస్ర నామ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకుడు శివానంద స్వామి తెలిపారు. యజ్ఞం నేపథ్యంలో భక్తులకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. అలాగే శ్రీ నిత్య శుద్ధానంద స్వామి చతుర్థ పుణ్యారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ప్రభుత్వాలు మారుతున్నా విశ్వకర్మల బతుకులు మారడం లేదు



సమావేశంలో మాట్లాడుతున్న కుమారచారి

మహేశ్వరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నారే తప్పా విశ్వకర్మల అభ్యున్నతికి ఏ ఒక్కరు కూడా ముందుకు రావడం లేదని విశ్వకర్మ సంఘం అమీర్‌పేట గ్రామ శాఖ అధ్యక్షుడు కుమారచారి అన్నారు. ఆదివారం అమీర్‌పేటలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో సంఘం సమావేశం నిర్వహించారు. విశ్వకర్మ సంఘం కుటుంబాలకు చెందిన 1 వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు స్టేషనరీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమీర్‌పేటలో గ్రామ పంచాయతీ సహకారంతో సంఘ సభ్యులందరూ కలిసి చిన్న గుడిని పెద్ద గుడిగా నిర్మించుకున్నామన్నారు. విశ్వకర్మలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా చాలా వెనకబడి ఉన్నారన్నారు. మాజీ సర్పంచ్ శ్రీశైలంగౌడ్ తో పాటు విశ్వకర్మ సంఘం సభ్యులు వెంకటాచారి, శేఖర్‌చారి, బాలాచారి, మోహనచారి తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరులకు పరికరాల పంపిణీ

ఆమనగల్లు : విశ్వకర్మ యోజన కింద ఆమనగల్లు మండలం, మున్సిపాలిటీ పరిధిలోని 12 మంది వడ్డెరులకు పరికరాలు మంజూరయ్యాయి. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో వడ్డెరులకు మంజూరు పరికరాలను ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి పంపిణీ చేశారు. అన్ని వర్గాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఆచారి అన్నారు. బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, మండలధ్యక్షుడు ఎర్రవోలు శ్రీను, నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ కౌన్సిల్ మెంబర్ లక్ష్మణ్, కల్వకుర్తి నియోజకవర్గ బీజేపీ కో-కన్వీనర్ నర్సింహ, బీజేపీ జిల్లా, మండల నాయకులు కృష్ణ యాదవ్, రవిరాథోడ్, పద్మప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.